క్లుప్తంగా

మచిలీపట్నం వెళ్లి పింఛను అందజేసిన వలంటీరు



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామ సచివాలయం 3 పరిధిలోని లబ్ధిదారు వీరమాచనేని నాగలక్ష్మి కాలు విరిగి మచిలీపట్నంలో సాయిశ్రీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వలంటీరు ముల్లంగి రాజు మంగళవారం మచిలీపట్నం ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశారు. వలంటీరు రాజును గ్రామస్తులు అభినందించారు.

రూరల్ మండలంలో 98.66 శాతం పింఛన్లు పంపిణీ

విజయవాడ రూరల్ మండలంలో 98.66 శాతం మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేసినట్టు ఎంపీడీఓ బి.భార్గవి తెలియజేశారు. మండలంలో మొత్తం 17వేల 278 మంది లబ్ధిదారులుండగా వారిలో 17వేల 46 మందికి 4కోట్ల 74లక్షల 69వేల 750 రూపాయలను అందజేసినట్టు చెప్పారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

అంబాపురం(విజయవాడరూరల్):పి.నైనవరం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని చదువుకునేందుకు అంబాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్లమోతు చంద్రశేఖర్, తోడేటి బెంజిమెన్ మంగళవారం 25వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. పి.నైనవరం గ్రామ నివాసి షేక్ బాషా కుమార్తె షేక్ ఆషా మిక్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతోంది. పేదరికం వల్ల అంబాపురం గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్‌ను ఆర్థిక సహాయం అందజేయాలని కోరగా వెంటనే స్పందించిన చంద్రశేఖర్, తోడేటి బెంజిమెన్ రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎమ్మెల్యే వంశీ తోడ్పాటు

ఉంగుటూరు: మిచాంగ్ తుఫాన్ ఉధృతి పెరగడంతో మంగళవారం మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. ఎంపీడీవో శేషగిరిరావు, ఈవోపీఆర్డీ అమీర్‌బాషా మంగళవారం లోతట్టు ప్రాంతాలను సందర్శించారు. ఇందుపల్లి, వేంపాడు గ్రామాల్లోని 90 యానాది కుటుంబాలు, నందమూరు గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కన పూరి గుడిసెలు వేసుకుని ఉంటున్న 40 బుడగ జంగాల కుటుంబాలను గుర్తించారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదేశాల మేరకు వారిని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎమ్మెల్యే ఆర్థిక తోడ్పాటుతో వారికి ఆహారం, తాగు నీరు అందజేశారు. తమ కష్టాన్ని గుర్తించి తక్షణమే పునరావసం కల్పించి ఆహారం అందజేసిన ఎమ్మెల్యే వంశీకి, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

మానవత సంస్థకు వితరణ



హనుమాన్‌జంక్షన్‌రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాతలు రూ.60 వేల విరాళాన్ని అందజేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత భవన నిర్మాణానికి విలువైన స్థలాన్ని విరాళంగా అందించిన జన్యావుల సీతారామయ్య, రంగమ్మ కుటుంబానికి చెందిన గాంధీరావు తన కుమారుడు నవీన్‌బాబు జ్ఞాపకార్థం రూ.50,116 వితరణగా అందజేశారు. గాంధీరావు కుమార్తె, అల్లుడు తోట మాధవి, రవికుమార్ దంపతులు రూ.10,116 విరాళాన్ని అందించారు. ఈ మొత్తాన్ని మానవత వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డికి అందించినట్లు రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు మంగళవారం తెలిపారు. హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బారెడ్డి,కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

అభయాంజనేయుని సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు కాల్వగుంట వెంకట ఆంజనేయ కిషోర్, అనురాధ దంపతుల వితరణతో అన్నదానం నిర్వహించారు.ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను తక్షణం ఆదుకోవాలి

గన్నవరం: తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి డిమాండ్ చేశారు. గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను, తడిసిన ధాన్యం నిల్వలను మంగళవారం ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ఆంక్షలను ఎత్తివేసి రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

వికసిత్ భారత్ సంకల్ప సభ

గన్నవరంరూరల్: మండలంలోని గోపవరపుగూడెం సచివాలయం వద్ద మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు.

అందివచ్చిన పంట నీటిపాలు

- నేలవాలిన వరి పంట
- పనలపై పంట నీట మునక
- గాలులతో అరటితోటలు ధ్వంసం
- తీవ్రంగా నష్టపోయిన రైతులు



పోరంకిలో నీట మునిగిన పంట పొలం



బాపులపాడు మండలం కాకులపాడులో నీట మునిగిన వరి పనలు



బుద్ధవరంలో నీట మునిగిన వరి పనలను పరిశీలిస్తున్న ఆర్బీకే సిబ్బంది

పెనమలూరు: మిచాంగ్ తుపాను రైతులకు కన్నీటిని మిగిల్చింది. మరి కొద్దిరోజుల్లో పంట చేతికి వచ్చే సమయంలో తుపాను విరుచుకుపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండల పరిధిలో దాదాపు 3 వేల ఎకరాల వరి ధాన్యం వర్షం నీటిపాలైంది. పెనమలూరు మండలంలో దాదాపు 5500 ఎకరాలలో వరి సాగు జరిగింది. రైతులు దాదాపు 3500 ఎకరాలలో 1061 రకం విత్తనం వాడారు. ఎంటీయు 1318 రకం దాదాపు 2 వేల ఎకరాల్లో వేశారు. ఇదే కాకుండా 1140, 1153 రకం విత్తనాలు కూడా రైతులు సాగు చేశారు. వరి పంట ఈ ఏడాది బాగానే పండటంతో రైతులు చాలా ఆనందంగా ఉన్నారు. ఈ లోపు మిచాంగ్ తుపాను ఒక్కసారిగా విరుచుకుపడటంతో చేతికి వచ్చిన పంట చేజారింది. ప్రధానంగా 1061 రకం వరి పూర్తిగా చేలలో పడిపోయింది. దాదాపు 3 వేల ఎకరాల పంట నీటిలో ఉంది. ఎంటీయూ 1318 కూడా నీట మునిగింది. పోరంకి, వణుకూరు, చోడవరం, పెదపులిపాక, గంగూరులో వరి పంటలు పూర్తిగా నీట మునగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 40 ఎకరాల్లో వరి పంట పనలపై ఉండి వర్షం నీటిలో నానుతోంది. నీట మునిగిన వరి పంటను ఏం చేయాలో తెలియక రైతులు దిగాలుగా ఉన్నారు.

ధాన్యం కాపాడుకునే పనిలో రైతులు

ఇప్పటికే వరి యంత్రాలతో కోతలు కోయటంతో ధాన్యం కూడా పంట పొలాల వద్దే ఉంది. అధికారులు చొరవ తీసుకోవటంతో దాదాపు 1100 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించారు. ఇంకా 2200 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించాల్సి ఉంది. ఈ లోగా తుపాను రావటంతో పంట పొలాల వద్దే ధాన్యం తడవకుండా రైతులు చర్యలు తీసుకున్నారు. వర్షం తగ్గిన తరువాత వెంటనే ధాన్యం తరలించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అరటి తోటలు ధ్వంసం

తుపాను కారణంగా వచ్చిన ఈదురు గాలులతో అరటి తోటలు ధ్వంసమయ్యాయి. వణుకూరు, గోసాల, తాడిగడప ప్రాంతంలో దాదాపు 40 ఎకరాల అరటి తోట పూర్తిగా దెబ్బతింది. మరో 15 రోజుల్లో పంట దిగుబడి వచ్చే దశలో అరటి చెట్టు పడిపోవటంతో రైతులు నష్టపోయారు.

వర్షం తగ్గితేనే నష్టం అంచనా

తుపాను కారణంగా కురుస్తున్న వర్షం తగ్గితేనే పంట నష్టం అంచనా వేయగలమని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. మండలంలో 5500 ఎకరాల వరి సాగు జరిగితే 500 ఎకరాల్లో కోతలు జరిగాయన్నారు. ఇంకా 5 వేల ఎకరాలు కోతలు కోయాల్సి ఉండగా దాదాపు 3 వేల ఎకరాలకు పైగా పంట నీట మునిగి దెబ్బతిందని వివరించారు.

ఎడతెరిపి లేని వర్షంతో రైతులకు ఇక్కట్లు

గన్నవరంరూరల్: మండలంలో మంగళవారం ఎడతెరపి లేని వర్షం కురిసింది. దీంతో వరి పంట నీట మునిగింది. ఇప్పటికే కోతలు కోసి పనలపై ఉన్న వరి చేలల్లో నీరు చేరింది. తెంపల్లిలో వేరు శనగ నీట మునగగా వ్యవసాయ శాఖ సిబ్బంది పరిశీలించారు. సూరంపల్లిలో వీఆర్వో పి.అర్జునరావు పర్యటించి రైతులను కలసి వివరాలు సేకరించి పంట నష్టం లేకుండా తీసుకోవాల్సిన చర్యలు వీఏఏ రవితేజతో కలసి సూచించారు. మండలంలోని గ్రామాల్లో 7022 ఎకరాల్లో వరి, 405 ఎకరాల్లో వేరుశనగ, 545 ఎకరాల్లో పత్తి నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. గ్రామాల వారీగా వివరాలు నమోదు చేసి జిల్లా వ్యవసాయ శాఖకు పంపినట్లు ఏవో తేజశ్వి తెలిపారు.

మిల్లులకు ధాన్యం రవాణా

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లోని పొలాల్లో కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని హుటాహుటిన అధికారులు మిల్లులకు తరలిస్తున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో మొత్తం సుమారు 3500 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఈ గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల్లో సాగు అవుతున్న వరి పంటల ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. తుపాను ప్రభావంతో పలు గ్రామాల్లోని పొలాల్లో వరి పనలు వాలిపోయాయి. నిడమానూరులో 20 ఎకరాలు, గూడవల్లిలో 45 ఎకరాలు, ఎనికేపాడులో 50, రామవరప్పాడులో 10, ప్రసాదంపాడులో 10 ఎకరాలు వాలిపోగా, కుప్పల మీద గూడవల్లిలో 88 ఎకరాలు, ఆత్కూరులో 38 ఎకరాలు, ఎనికేపాడు, రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కలిపి 46 ఎకరాలు ఉన్నాయి. రైతులు ఇబ్బందులు పడకుండా అధికారులు ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయిస్తున్నారు. రైతులు తోలిన ధాన్యాన్ని రైసు మిల్లులు వెంటనే దించుకోవాలని ఇప్పటికే తహసీల్దార్ లక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ జి.వెంకటేశ్వర్లు పలు గ్రామాలు పర్యటించి రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

నీట మునిగిన పంట పొలాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బాపులపాడు మండలంలో వరి పంటకు నష్టం వాటిల్లింది. వరి కోతలు పూర్తి చేసిన పొలాల్లో ధాన్యం కల్లంలోనే ఉండటంతో వర్షం కారణంగా తడిసిపోయింది. వరి పనల మీద ఉన్న పంట పొలాలు కూడా పూర్తిగా నీట మునిగాయి. మరికొన్ని చోట్ల ఈదురుగాలుల ధాటికి వరి పనలు నేలకు ఒరిగిపోయాయి. వ్యవసాయ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశారు. సుమారు 20 గ్రామాల్లో 5343 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని, మరో 3117 ఎకరాల్లో వరి పనలు నేలకు ఒరిగిపోయాయని ఏవో జొన్నలగడ్డ భవాని చెప్పారు. రెండు గ్రామాల్లో మొక్కజొన్న పంటకు 400 ఎకరాలలో నష్టం వాట్లిందని తెలిపారు.

గన్నవరం మండలంలో...

గన్నవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పంట పొలాలు ముంపు బారినపడ్డాయి. డెల్టా ప్రాంతంలోని బుద్ధవరం, దావాజిగూడెం, కేసరపల్లి, అల్లాపురం గ్రామాల పరిధిలో ఈదురు గాలుల ధాటికి వరి పైరు నేలకొరిగింది. ఇప్పటికే కోత కోసిన వరి పనలు నీట మునిగాయి. వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పలు గ్రామాల్లో యంత్రాలతో కోత కోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో 7,022 ఎకరాల్లో వరి, 545 ఎకరాల పత్తి, మరో 405 ఎకరాల్లో వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.



పోరంకిలో పనలపై ఉన్న వరి పంట



వణుకూరులో ధ్వంసమైన అరటి తోట



తెంపల్లిలో నీటిలో వేరు శనగ పంట చూపుతున్న రైతు



ఎనికేపాడులో తుపాను ప్రభావంతో వాలిపోయిన వరి పంట

కన్నీట మునిగిన రైతు



దావులూరులో నీట మునిగిన వరి పనలు

- నీటిలో నానుతున్న వరి పనలు
- మురుగు తొలగింపు పనుల్లో అన్నదాతలు
- ధాన్యం తరలింపులో రైతులకు అండగా అధికారులు

కంకిపాడు/ఉయ్యూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో నియోజకవర్గం అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పంట పొలాలను వర్షం ముంచెత్తింది. కోత కోసి కుప్పలు వేసేందుకు సిద్ధంగా ఉన్న వరి పంట నీట మునిగింది. వర్షానికి బలమైన ఈదురుగాలులు తోడవటంతో వరి పంట నేల వాలింది. ఉద్యాన పంటల క్షేత్రాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. పొలాల్లో నిలిచిన వర్షపునీటిని పక్కనే ఉన్న పంట బోదెల్లోకి మళ్లించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. నేలవాలిన వరి పంటను నిలగట్టే యత్నం చేస్తున్నారు. వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డు మార్జిన్లలో చెట్లు కూలటం, విద్యుత్ లైన్లు తెగటంతో విద్యుత్ సరఫరాకు బ్రేక్ పడింది. కడవకొల్లులో ట్రాన్స్‌ఫార్మర్, ఆరు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. విద్యుత్ అధికారులు విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. తుపాను కారణంగా మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలతో అన్నదాతలు గజగజ వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు మార్జిన్లలో ఉన్న ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేలా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టి అన్నదాతలకు అండగా నిలుస్తున్నారు.



ప్రొద్దుటూరులో వరి పొలంలో నీరు రాకుండా వరి దుబ్బులతో అడ్డీ వేస్తున్న రైతు



కంకిపాడులో నీటిలో తేలుతున్న వరి పనలు

నీట మునిగిన 15వేల ఎకరాల వరి పంట

ఉంగుటూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో సుమారు 15వేల ఎకరాల వరి పంట నీట మునిగినట్లు ఏవో హరీష్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా 25,500 ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 5 వేల ఎకరాలు వరికోత యంత్రంతో కోత కోసి కొంత ధాన్యం మిల్లుకు తరలించగా మరి కొంత ధాన్యం సురక్షిత ప్రాంతంలో టార్పాలిన్ పట్టాలతో భద్రపరచారు. 200 ఎకరాలు కోసి పనలమీద ఉంది. 18వేల ఎకరాలు కోతకు వచ్చి సిద్ధంగా ఉంది. ఇందులో సుమారు 15వేల ఎకరాలు కొంత వర్షానికి నీటమునిగి, మరికొంత నీటిలో పడిపోయిందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు. వీఏఏలు ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. పొలంలోని నీరు బయటకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు.



తుట్టగుంటలో నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న వీఏఏలు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన

కంకిపాడు/ఉయ్యూరు: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా అధికారులు మంగళవారం విస్తృతంగా పర్యటించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి, జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి తమ బృందంతో కాటూరు, పెద ఓగిరాల, చిన ఓగిరాల, చలివేంద్రపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో తుపాను కారణంగా నేలవాలిన వరి పొలాలు, అరటి తోటలను పరిశీలించారు. పొలాల్లో నిలిచిన నీటిని నిల్వ ఉండకుండా చూడాలని, పనలను ఒడ్డుకు చేర్చుకోవటం ద్వారా మొలక శాతం నివారించుకోవచ్చన్నారు. ఉద్యానపంటల్లో నీటి నిల్వతో నష్టం, తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటుందని, రైతులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. పరిశీలనలో వ్యవసాయశాఖ ఏడీ సునీల్, ఏఓ నిస్సి గ్రేస్, ఉద్యానశాఖ అధికారులు ఎ.నాగదేవిశ్రీ, చందు జోసఫ్ సుందరం పాల్గొన్నారు.



కాటూరులో వరి పనలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఎన్.పద్మావతి



చలివేంద్రపాలెంలో అరటి తోటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ సర్కారు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు/ఉయ్యూరు: రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ సర్కారు నిలుస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. కంకిపాడు మండలం పునాదిపాడు, కోలవెన్ను, కుందేరు, ఉయ్యూరు మండలం కాటూరు, కడవకొల్లు తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తుపాను ప్రభావంతో ఏర్పడిన పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట చేతికి వచ్చిన తరుణంలో తుపాను నష్టం చేయటం బాధాకరమన్నారు. కోత కోసిన పంట రవాణా ఆటంకాల కారణంగా నిలిచిపోకుండా వాహనాలను ఏర్పాటు చేస్తూ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. రైస్‌మిల్లుల వద్ద దిగుమతి పెండింగ్ పడకుండా మిల్లర్లకు సూచనలు ఇచ్చామన్నారు. ఆర్బీకే తేమ శాతం, మిల్లర్ల వద్ద తేమ శాతానికి వ్యత్యాసం వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆపద సమయంలో రైతులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా, మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని స్పష్టంచేశారు. పర్యటనలో జెడ్పీటీసీ బాకీ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మునిబోయిన వెంకటేశ్వరరావు, పిడికిటి రామకోటేశ్వరరావు, కొణతం గిరిధర్, పిన్నిబోయిన శ్రీనివాసరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



కాటూరులో నీట మునిగిన వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉత్తమ పాలనతోనే పంచాయతీల అభివృద్ధి

ఎంపీడీఓ సునీతాశర్మ

పెనమలూరు: గ్రామ పంచాయతీల పాలన సమగ్ర ప్రణాళికతో ఉత్తమ పాలన అందిస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీల సాధారణ పరిపాలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సునీతాశర్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో గ్రామాభివృద్ధిపై ఆదాయ వ్యయాలను అంచనా వేసి సమగ్ర ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. పన్నుల వసూళ్లు 100 శాతం ఉండాలని, గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీలలో రికార్డులు సక్రమంగా ఉండాలని తెలిపారు.ప్రభుత్వ పథకాలు అర్హులైన పేదలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర లో క్రీడాకారుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలని తెలిపారు. తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ కులగణన త్వరలో చేపడుతున్నామని సచివాలయాల సిబ్బంది సమాచారం సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచిలు కాకర్ల వెంకటరత్నం, సంగెపు శ్రీనివాసరావు, లింగాల భాస్కరరావు, అక్బర్‌పాషా, ఏవో శివశంకర్‌రావు, ఎంఈఓ కనకమహాలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ

గుడివాడ రోడ్డులో కూలిన చెట్లు

కంకిపాడు: తుపాను కారణంగా వీచిన ఈదురుగాలులకు గుడివాడ-కంకిపాడు రోడ్డు మార్గంలో భారీ వృక్షాలు నేలకూలాయి. తుపాను తీరం దాటిన తరువాత మంగళవారం రాత్రి వీచిన బలమైన గాలుల ధాటికి గుడివాడ రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న రెండు భారీ వృక్షాలు కూలిపోయాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. కంకిపాడు నుంచి గుడివాడ వైపు వెళ్లే వాహనాలను గన్నవరం, పామర్రు మీదుగా మళ్లించారు. చెట్లు కూలి ట్రాఫిక్ స్తంభించటంతో తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఆర్‌అండ్‌బీ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని కూలిన చెట్లను తొలగించే పనులను చేపట్టారు. లాకురోడ్డులో భారీ వృక్షం విద్యుత్ తీగలపై కూలింది. తుపాను ప్రభావంతో మండలంలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి చాలా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టి, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నారు.

క్రీడాకారుల నమోదు వేగవంతం చేయాలి

గన్నవరం: ఆడుదాం ఆంధ్రలో పాల్గొనే క్రీడాకారుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రపై వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వ్యాయామోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి క్రీడాకారుడు పేర్లు నమోదు చేసుకునే విధంగా గ్రామాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. నియోజకవర్గ క్రీడల సమన్వయకర్త దనియాల నాగరాజు, పలువురు వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరంకిలో వస్త్ర దుకాణంలో చోరీ

పెనమలూరు: పోరంకిలో ఓ వస్త్ర దుకాణంలో చోరీ జరగటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం విజయవాడ ఐటీఐ కళాశాల ప్రాంతానికి చెందిన సీహెచ్ రాంబాబు పోరంకి లక్ష్మీపురం కాలనీ వద్ద వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన షాపులో వ్యాపారం ముగించుకుని తాళాలు వేసివెళారు. సోమవారం వచ్చి చూసుకునే సరికి గుర్తు తెలియని వ్యక్తి వెనుక వైపు తలుపు తాళాలు పగుల కొట్టి రూ.13 వేలు, ల్యాప్‌ట్యాప్ చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమేరా పుటేజీ పరిశీలించగా ఓ వ్యక్తి షాపులో చోరీ చేసిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు

పెనమలూరు: కానూరులో మహిళను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు అశోక్‌నగర్‌కు చెందిన బావినేని మాధురి లతా రెసిడెన్సీలో ఉంటోంది. అదే అపార్టుమెంట్‌లో ఉంటున్న కొల్లి రామకృష్ణ, పర్వతనేని వీరభద్రరావులతో అపార్టుమెంట్‌లో విషయమై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో వారిద్దరూ మాధురిని నిత్యం దూషిస్తూ బెదిరించసాగారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.